మళ్లీ మన ప్రభుత్వమే రావాలి

- సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి
- రేపు 7వేల మందితో భారీ సభ

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తేవడానికి పార్టీ శ్రేణులు శ్రమించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కోరారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణ లో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాల కన్వీనర్లు, వార్డు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మరో మారు రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందని, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని 82 సచివాలయాలకు ముగ్గురు చొప్పున కన్వీనర్లను నియమించామని, క్లస్టర్‌కు ఇద్దరు చొప్పున గృహ సారథులను నియమించామన్నారు. ఈనెల 20వ తేదీకల్లా వీరిని నియమించాల్సి ఉండగా, మన నియోజకవర్గం ముందంజలో ఉందని తెలిపారు. ఇప్పటికే గడపగడపకు మన ప్రభుత్వంలో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో మన నియోజకవర్గంలో ఫిబ్రవరి నాటికి ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామన్నారు. తర్వాత రచ్చబండ కార్యక్రమం పేరుతో అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామాల్లో పర్యటిస్తామని చెప్పారు.

7వేల మందితో జగన్ సైన్యం తయారైంది

ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి ప్రజాప్రతినిధులతోపాటు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిపి కొత్తగా 7వేల మందితో జగన్ సైన్యం తయారైందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. వీరందరితో కలిపి ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సభను నిర్వహించి దిశ, నిర్దేశం చేస్తామన్నారు.

కన్వీనర్ మృతికి సంతాపం

రాజుపాళెం మండలం టంగుటూరు గ్రామంలో మృతి చెందిన సచివాలయ కన్వీనర్ ముక్కమల్ల రవిశంకర్‌రెడ్డి మృతికి సమావేశంలో ఎమ్మెల్యే రాచమల్లుతోపాటు పార్టీ శ్రేణులు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, గోపవరం సర్పంచ్ గద్దా మోషా, ఉప సర్పంచ్ బీరం రాఘవరెడ్డి, రాజుపాళెం మండల ఉపాధ్యక్షుడు ఎస్‌ఏ నారాయణరెడ్డి, రాజుపాళెం జెడ్పీటీసీ జీరెడ్డి అంజనీకుమారి గోవర్ధన్‌రెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, నియోజకవర్గ అధ్యక్షురాలు గజ్జల కళావతితోపాటు మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

కన్వీనర్లకు ఇన్‌చార్జిల నియామకం

ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి నూతనంగా ఏర్పాటు చేసిన వార్డు, గ్రామ సచివాలయ కన్వీనర్లకు ఇన్‌చార్జిలను నియమించినట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి శుక్రవారం జరిగిన సమావేశంలో ప్రకటించారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి సంబంధించి 41 వార్డుల సచివాలయాలకుగాను సీనియర్ నాయకులు కాకర్ల నాగేశారెడ్డి, పోసా భాస్కర్‌లను, ప్రొద్దుటూరు మండలానికి సంబంధించి కల్లూరు నాగేంద్రారెడ్డి, రాజుపాళెం మండలానికి సంబంధించి వెలవలి రాజశేఖరరెడ్డిని ఇన్‌చార్జిలుగా నియమించారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రొద్దుటూరు మండల అధ్యక్షుడిగా మార్తల ఓబుళరెడ్డి, రాజుపాళెం మండలం అధ్యక్షుడిగా గుద్దేటి రాజారాంరెడ్డిలను నియమించారు. ఇక నుంచి ప్రతి సచివాలయాలనికి సంబంధించి కన్వీనర్లను, గృహ సారథులను సమన్వయం చేసుకుంటూ పార్టీ విజయానికి కృషి చేస్తారని ఎమ్మెల్యే తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుంది

రాజుపాళెం : మంలంలోని టంగుటూరు గ్రామంలో పాము కాటుకు గురై మృతి చెందిన ముక్కమల్ల రవిశంకర్‌రెడ్డి కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మండలంలోని టంగుటూరు గ్రామంలో రవిశంకర్‌రెడ్డి ఇంటి వద్దకు వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవలే రవిశంకర్‌రెడ్డిని పార్టీ సచివాలయ కన్వీనర్‌గా నియమించామని తెలిపారు. పాముకాటుకు గురై మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. అనంతరం రవిశంకర్‌రెడ్డి భార్య అరుణ, కుమార్తెలను ఎమ్మెల్యే పరామర్శించి ఓదార్చారు. అలాగే గ్రామంలో కాచన నారాయణమ్మ మృతి చెందిన విషయం ఎమ్మెల్యేకు తెలియగానే ఆమె ఇంటి వద్దకు వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, యువనాయకుడు గౌతమ్‌రెడ్డి, గోపాయపల్లె సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, సోమేశ్వరస్వామి ఆలయ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, కాకర్ల నాగేశారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చాపాడు ఎస్‌ఐగా కేసీ రాజు

చాపాడు: చాపాడు మండల సబ్ ఇన్‌స్పెక్టర్‌గా సీకే రాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అట్లూరు ఎస్‌ఐగా పని చేస్తూ బదిలీపై చాపాడు పోలీసుస్టేషన్‌కు వచ్చారు. చాపాడు ఎస్‌ఐగా పని చేస్తున్న డాక్టర్ నాయక్ అంతర్ జిల్లాల బదిలీపై కర్నూలు జిల్లా బనగానపల్లె నియోజకవర్గంలోని ఆలూరు మండల ఎస్‌ఐగా వెళ్లారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

బ్రహ్మంగారిమఠం: మండలంలోని చౌదరవారి పల్లె గ్రామ సచివాలయం పరిధిలో శనివారం ఉదయం 7 గంటలకు రెండవరోజు గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయం పరిధిలో చౌదరవారి పల్లె, బీసీ కాలనీలో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమం మండలస్థాయి అధికారులతోపాటు, వైఎస్సార్‌సీపీ పంచాయతీ కార్యకర్తలు, మండల స్థాయి నాయకులు పాల్గొనాలన్నారు

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

బద్వేలు: సచివాలయం సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని పోరుమామిళ్ల మండల ప్రత్యేకాధికారి డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పోరుమామిళ్లలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ సచివాలయ సందర్శనలో చాలా చోట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండటాన్ని గమనించి పలు సూచనలు చేశారన్నారు. సిబ్బంది తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు రాజీవ్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సుజిత, ఖాసీంపీరా, నారాయణబాబు, రవీంద్రారెడ్డి, చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక అక్షరాస్యతపై అవగాహన

దువ్వూరు : మండలంలోని భీమునిపాడు గ్రామ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో శుక్రవారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు గుడిపాడు శాఖ మేనేజర్ స్రవంతి ఆధ్వర్యంలో ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ తమ బ్యాంకు అందిస్తున్న సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బ్యాంకు అందిస్తున్న వివిధ పథకాలు, ఇన్సూరెన్స్ పథకాలను వివరించారు. అనంతరం బ్యాంకు అందిస్తున్న సేవలపై, ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతపై కళాజాత బృందం పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ నీలావతి, ఉమామహేశ్వరి, బ్యాంకు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఆడ బిడ్డలను ఆదరించండి

రాజుపాళెం : మగ బిడ్డలతో సమానంగా ఆడ బిడ్డలను ఆదరించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి పేర్కొన్నారు. మండలంలోని కూలూరు సచివాలయంలో శుక్రవారం బేటి బచావో – బేటి పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీకళ, స్వర్ణలత, రేష్మ, మేరి పాల్గొన్నారు.

రేపటి నుంచి మహాకుంభాభిషేకం

మైదుకూరు : మైదుకూరులోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం (అమ్మవారిశాల)లో ఆదివారం నుంచి 27వ తేదీ వరకు మహా కుంభాభిషేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో 22న సాయంత్రం శివ పార్వతుల కళ్యాణం నిర్వహించనున్నారు. వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా 23న హోమగుండ ప్రవేశం, చండీ హోమం నిర్వహించనున్నారు. 24న లక్ష్మీనారాయణ, సుదర్శన హోమాలు, చండీ హోమం, అన్న ప్రసాద వినియోగం ఉంటాయని నిర్వాహకులు వివరించారు. 27న అమ్మవారి గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు. మహా కుంభాభిషేక ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు సూరిశెట్టి వెంకటశివప్రసాద్ కోరారు.

నాణ్యతా ప్రమాణాలు పెంచాలి

ప్రొద్దుటూరు : సోములవారిపల్లె జగనన్న కాలనీలో నాణ్యతా ప్రమాణాలను పెంచాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు తెలిపారు. తమ పార్టీ కార్యకర్తలతో కలిసి శుక్రవారం కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.30లక్షలు వెచ్చించి ట్యాంకు నిర్మించినా చుక్క నీరు రావడం లేదని తెలిపారు. ప్రతి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షరీఫ్, చంద్రశేఖర్, ప్రతాప్, శివ, ప్రమీల పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

ప్రొద్దుటూరు : అంగన్‌వాడీ కార్యకర్తలకు గృహ సందర్శన ఆవశ్యకతపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత కుమారి మాట్లాడుతూ గృహ సందర్శన ఎలా చేయాలి, ప్రాముఖ్యతను వివరించారు. సరైన సమయానికి లబ్ధిదారులకు పోషకాహారం ఇచ్చి సలహాలు ఇవ్వాలని సూచించారు. వారి ఆరోగ్య పరిస్థితిని మెరుగు పరచడానికి టిమ్స్ ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. స్థానిక జిన్నా రోడ్డులోని మున్సిపల్ ఉర్దూ హైస్కూల్‌లో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటి బచావో – బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఇమామ్ హుసేన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ.నాగేశ్వరి, మహిళా పోలీస్ జ్యోతిర్మయి, ఏఎస్ఎం దీప్తి పాల్గొన్నారు.

రాష్ట్రంలో జనరంజక పాలన

– ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం: పార్టీలకు అతీతంగా ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకం ఇవ్వడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని చౌదరవారిపల్లె సచివాలయం పరిధిలో మొదటి రోజు గుండాపురం, ఎస్సీ కాలనీ, జి. నరసింహపురం, చౌదరవారిపల్లె ఎస్సీ కాలనీలలో గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం నిరుపేదలకు అందించిన సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీలో ప్రభుత్వం ఇంతవరకు రూ.8.36 కోట్లు వివిధరకాల పథకాల కింద కుటుంబాలకు అందించడం జరిగిందన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు 99 శాతం పూర్తిచేయడం జరిగిందన్నారు. ప్రజలు సంక్షేమ పథకాలతో ఆనందంగా ఉన్నారన్నారు. ప్రజలు ఎస్సీకాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కావాలన్నారు. గతంలో నిరుపేదకు ఇచ్చిన డి పట్టాలకు భూములు చూపాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, సింగల్ విండోఅధ్యక్షుడు సుబ్బారెడ్డి ,సర్పంచ్ పెద్దిరెడ్డి చిన్న ఓబుల్‌రెడ్డి, ఎంపీటీసీ గ్రామ సచివాలయ కన్వీనర్లు గుండాపురం రమణారెడ్డి, అంకిరెడ్డిపల్లె చంద్ర ఓబుల్‌రెడ్డి, ఎంపిడీఓ వెంగమునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు లెక్కల కొండారెడ్డి, గుండాపురం సుబ్బారెడ్డి, ఖాజావల్లీ, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గుండాపురం ఎస్సీకాలనీలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

మైదుకూరు : మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అధికారులకు, వార్డు కౌన్సిలర్లకు సూచించారు. మైదుకూరులో శుక్రవారం ఆయన మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్రతో కలసి అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీలోని వార్డుల వారీగా పనుల పురోగతిపై కమిషనర్ రాముడు, ఏఈ నిరంజన్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, ఇన్‌చార్జిలతో మాట్లాడారు. మున్సిపాలిటీ అభివృద్ధికి మౌలిక వసతుల కల్పన కోసం చేపట్టిన పనులే కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జరుగుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని, ప్రారంభంకాని వాటిని వెంటనే మొదలు పెట్టాలని సూచించారు.

పాలనలో విప్లవాత్మక మార్పు

– ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పాలనలో విప్లవాత్మకమార్పు తీసుకొచ్చారని, అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని అమలు చేస్తున్నారని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధి గిరినగర్‌లోని మహబూబ్‌నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి తిరిగి ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి రానున్న ఎన్నికల్లో జగనన్నకు మద్దతు పలకాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీలు కలవకూరి రమణ, మహబూబ్‌పీరా, చంద్రాయుడు, నాయకులు చాపాటి నారాయణరెడ్డి, ఆదిబోయిన కొండయ్య, చాపాటి సాయి నారాయణరెడ్డి, రుద్రవరం ప్రసాద్, ఎంపీడీఓ నూర్జహన్, ఈఓపీఆర్డీ భాస్కర్‌బాబు, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

అట్లూరు: పేదల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మండల పరిధిలోని తంబళ్లగొంది సచివాలయంలోని సోమేశ్వర పురం, లింగాలకుంట, ఎస్సీ కాలనీ, ఎస్టీకాలనీ, దేవ్‌నగర్‌లలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతి గడపకు వెళ్లి ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరించారు. మరోసారి ప్రజల బాగోగులు చూసుకునే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని కోరారు.



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారుడికి అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ

ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి చైర్మన్ రొండా మాధవరెడ్డి, మండల కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఆందూరి రామక్రిష్టారెడ్డి, పార్టీ బద్వేలు మున్సిపల్ కన్వీనర్ ఈగ యద్దారెడ్డి, నాయకులు పుత్తా శ్రీరాములు, పోతిరెడ్డి రెడ్డయ్య, పెంచల్‌రెడ్డి, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సహాయక కేంద్రాల ఏర్పాటు

ప్రొద్దుటూరు క్రైం : ఈ నెల 22న కానిస్టేబుల్ పరీక్ష రాయడానికి ప్రొద్దుటూరుకు వస్తున్న అభ్యర్థుల కోసం పోలీసు సహాయక కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలను గుర్తించడంలో కానీ, అక్కడికి చేరుకునే విషయంలో అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు ఏఎస్పీ ప్రేరణాకుమార్ తెలిపారు. ఆర్టీసీ బస్టాండు, రాజీవ్ సర్కిల్, రైల్వే స్టేషన్‌ల వద్ద సహాయక కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలీసు సహాయం కోసం 9121100702 అనే కమాండ్ కంట్రోల్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

24న యువజన దినోత్సవం

పోరుమామిళ్ల: ఈనెల 24న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువజనోత్సవం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్టారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో యువతకు మానవతా విలువలపై అవగాహన కల్పించేందుకు ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణురాలు స్వర్ణలత, సమాజ సేవకులు రాజోలి శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ మార్కారెడ్డి, రంగసముద్రం సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి పాల్గొని ప్రసంగిస్తారన్నారు.

ఆటో బోల్తా... విద్యార్థులకు గాయాలు

కలసపాడు: మండలంలోని రాజుపాలెం–పుల్లారెడ్డిపల్లె గ్రామాల మధ్యలో శుక్రవారం ఆటో బోల్తా పడి పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. బాధితుల వివరాల మేరకు.. రాజుపాలెం గ్రామానికి చెందిన లాజర్ ప్రతి రోజు తన ఆటోలో ఉదయం, సాయంత్రం పదిమంది విద్యార్థులను కలసపాడులోని బాలికల ఉన్నత పాఠశాలకు తీసుకెళ్లి ఇంటికి చేర్చేవారు. అనారోగ్యం కారణంగా మరో వ్యక్తిని డ్రైవర్‌గా పంపారు. పాఠశాలకు వెళ్లే సమయంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో రాజుపాలెంకు చెందిన చైతన్య, అంజలి, నవీన, కృపారాణిలు తీవ్రంగా గాయపడ్డారు. మిగిలిన విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. వీరంతా 8, 9, పదో తరగతి చదువుతున్నారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వారిని పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నవీనాకు వెన్నుముక, కృపారాణికి కాలు, అంజలికి చేయి, చైతన్యకు భుజం ఫ్రాక్చర్ అయ్యాయి. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకు కడపకు తీసుకెళ్లారు. పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రిలో విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు కవిత, ఉపాధ్యాయులు పరామర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆస్పత్రి రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

– జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు

దువ్వూరు : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రికార్డులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు పేర్కొన్నారు. మండల కేంద్రమైన దువ్వూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా వైద్యాధికారి నాగరాజు, జిల్లా నేషనల్ హెల్త్ ప్రోగ్రాం అధికారి నాగశశిభూషణ్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు, గర్భవతులకు సరైన సమయంలో వైద్యం అందించి వారి వివరాలను రికార్డు చేయాలని సిబ్బందికి సూచించారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద చేపట్టిన పథకాలను వంద శాతం నిర్వహించాలని తెలిపారు. ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్లు సురేష్‌బాబు, సమీర, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన పెంచుకోవాలి

ఖాజీపేట : ఇంటి శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను అందరూ పాటించాలి, అలాగే పారిశుద్ధ్యంపై అందరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. నాగరాజు అన్నారు. శుక్రవారం ఆయన ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలించారు. అగ్రహారంలో పారిశుద్ధ్యం పరిశీలించారు. స్థానికులకు ఆయన సూచనలు చేశారు. ప్రతి ఫ్రైడే ని డ్రైడేగా అందరూ పాటించాలని అన్నారు. దోమతెరలను వాడాలని అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రాఘవయ్య, డీపీఎంఓ శశిభూషన్‌రెడ్డి, డాక్టర్ మునీబ్, నాగభూషణం, సూపర్‌వైజర్ కృష్ణప్రియ, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



దువ్వూరులో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగరాజు

రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన

పోరుమామిళ్ల: రోడ్డుపై వాహనాలు నడిపేటపుడు ఖచ్చితమైన నిబంధనలు పాటించాలని బద్వేలు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రావు చెప్పారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ జయసుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి వారు డ్రై వింగ్ లైసెన్స్‌కు అర్హులన్నారు. డ్రై వింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదన్నారు. మద్యం సేవించి, సెల్‌లో మాట్లాడుతూ డ్రై వింగ్ చేయరాదన్నారు. అతివేగం ఎప్పటికీ ప్రమాదమేనన్నారు. పరిమితికి మించి అధికంగా వాహనంలో ఉండరాదన్నారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. ప్రమాదాలు నివారించడమే ఈ అవగాహన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సీఐ సురేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జయసుబ్బారెడ్డి మాట్లాడారు.



మాట్లాడుతున్న ఎంవీఐ శేఖర్‌రావు

వసతులు కల్పించాలని వినతి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో మౌలిక వసతులు కల్పించాలని వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, కమిషనర్ వెంకటరమణయ్యలకు వినతి పత్రాలు అందించారు. మైదానంలో వాకర్స్‌కు మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. టాయిలెట్లు, లైటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి స్పందిస్తూ శనివారం ఉదయం పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వై.లక్ష్మిరెడ్డి, ఉపాధ్యక్షుడు అయూబ్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి రమేష్, ట్రెజరర్ డీకే సతీష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు జిలాన్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా ఆశ్రమ వార్షికోత్సవాలు



భగవద్గీత 4వ ముద్రణను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గీతాశ్రమం రోడ్డులోని శ్రీస్వారాజ్య ఆశ్రమ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని తెలిపారు. ధ్యానం చేయాలని, ఉపనిషత్తుల సారాంశాన్ని వివరించారు. శ్రీస్వారాజ్య భగవద్గీత నాల్గవ ముద్రణను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఉదయం నగర సంకీర్తనను పురవీధుల్లో నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షుడు వద్ది నరసింహులు, బ్రహ్మశ్రీ రామచైతన్య స్వామి, కృష్ణ చైతన్య స్వామి, మాతృశ్రీ రత్నమ్మ, ప్రభాకర్, ఉమా సుదర్శన్, మేఘమాల, వీహెచ్‌పీ నాయకులు నాగార్జున, మల్లికార్జునరావు, సందు శివనారాయణ, జింకా సుబ్రహ్మణ్యం, సాధు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

గోపవరం: మండలంలోని టి సండ్రపల్లె పంచాయతీ పరిధి బుచ్చనపల్లెలో శుక్రవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి స్పందన లభించింది. రాచపూడి నాగభూషణం జ్ఞాపకార్థం బద్వేల్ మున్సిపల్ వైస్ చైర్మన్ సాయిక్రిష్ణ, ప్రొద్దుటూరు పశువైద్యశాల ప్రొఫెసర్ దిలిప్ గుప్తా శిబిరాన్ని నిర్వహించారు. గోపవరం, రాజుపాలెం పశువైద్య అధికారులు డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ కృష్ణవేణి పశువులకు పరీక్షలు నిర్వహించారు. మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

కంటి పరీక్షలు



డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : వాహన డ్రైవర్లు ప్రతి ఆరు నెలలకొకసారి తప్పనిసరిగా కంటి సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని బద్వేలు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు పేర్కొన్నారు. 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ఎంవీఐ కార్యాలయ ఆవరణలో వాహన డ్రైవర్లకు కంటి వైద్య నిపుణులు సుభాన్ బాషా ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేయించారు. ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే డ్రైవర్ వ్యక్తిగత విషయాలను పక్కనపెట్టి వాహనం నడిపేటప్పుడు ఏకాగ్రతతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మన చేతుల్లోనే మన భద్రత

ప్రొద్దుటూరు క్రైం : మన భద్రత మన చేతుల్లోనే ఉందని సీనియర్ ఎంవీఐ నారాయణనాయక్ తెలిపారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రొద్దుటూరు ఆర్టీఓ సుశీల ఆధ్వర్యంలో రాజీవ్ సర్కిల్ నుంచి విజయ్‌కుమార్ సర్కిల్ వరకు విద్యార్థులు, వాహనదారులతో అధికారులు ర్యాలీ చేశారు. అనంతరం ఆర్టీఓ కార్యాలయంలో డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ యుగంధర్, త్రీ టౌన్ కృష్ణంరాజునాయక్, ఏఓ రహంతుల్లా, సీనియర్ వేణు, ఏఎంవీఐ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

బ్రహ్మంగారిమఠం: మండలంలోని చౌదరవారిపల్లె పంచాయతీ గుండాపురం గ్రామంలోని ఆదర్శ అంగన్‌వాడీకేంద్రంను శుక్రవారం ఎంపీడీఓ వెంగమునిరెడ్డి పరిశీలించారు. అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీదేవి మాట్లాడుతూ పిల్లలు 20 మంది ఉన్నారు. కేంద్రంలో బండ పరుపు సరిగా లేదని, వసతులు కల్పించాలని కోరారు. ఈ విషయంను ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి దృష్టికి ఎంపీడీఓ తీసుకెళ్లగా ఎమ్మెల్యే గ్రాంట్ ద్వారా నిధులు విడుదలచేయించి సమస్య పరిష్కరిస్తామన్నారు.

ముస్లిం కమ్యూనిటీ హాల్ నూతన కమిటీ ఎన్నిక

ప్రొద్దుటూరు : స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం ఎదురుగా ఉన్న ముస్లిం కమ్యూనిటీ హాల్ (షాదిఖానా) నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడుగా ఉప్పలూరు ఖలందర్, ఉపాధ్యక్షులుగా సి.జిలాని బాషా, వడ్ల షేక్ దాదాపీర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.అహ్మద్ హుసేన్, సహాయ కార్యదర్శులుగా అబ్దుల్ జలీల్, అహ్మద్ హుసేన్, కోశాధికారిగా షేక్ రెహమతుల్లాతోపాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వారిని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వడ్ల ఇబ్రహిం ఖలీలుల్లా, సికిలిగిరి ఇర్ఫాన్ బాషా, మాజీ కౌన్సిలర్ రఫి, వైఎస్సార్‌సీపీ నాయకులు హిదాయత్, సుభాన్ బాషా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల 33/11 కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు డీఈఈ కిరణ్‌కుమార్, ఏఈఈ వెంకట మహేష్ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని వారు కోరారు.

నేడు వెంగళాయపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం

రాజుపాళెం : మండలంలోని వెంగళాయపల్లె, అయ్యవారిపల్లె గ్రామాల్లో శనివారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్పంచ్ ధనిరెడ్డి రేణుకమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పాల్గొంటారని, ఆయా గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

నేడు పశువైద్య శిబిరం

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు గ్రామంలో ఉన్న పశువైద్యశాలలో శనివారం ఉదయం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు పశువైద్య అధికారిణి టి.లక్ష్మీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరులోని పశువైద్యకళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా ఈ పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారని ఆమె పేర్కొన్నారు.

WANTED
Diploma E.E.E : BC-D(W), OC-W and SC-W, For the Post of High Skilled Contract Labour and 10th Pass : BC-A(W) For the Post of Un-skilled Contract Labour.
M/s. S.N. CONSTRUCTIONS
MOB: 99858 67887